మీద ఆశ ఉన్నోనికి భయం. నాకేమిటికి మునెమ్మా! ఆ సామి ఎప్పుడు పిలిస్తే అప్పుడే పోతా!''.

''రాజయ్యా! దేవుడు నిజంగా ఉన్నాడా?'' అడిగింది అమాయకంగా.

ఆ మాటలకు ఒకింత నవ్వి..

''ఉన్నాడంటే ఉన్నాడు. లేడంటే లేడు అంతే!'' అన్నాడు రాజయ్య.

''అట్టకాదులే రాజయ్యా! నువ్వన్నట్లు దేవుడనేవాడుంటే తన ఇంటిని తానే ఇట్టా పాడుచేసుకుంటాడా? పదేళ్లనుంచి ఇలా పాడుపడిపోయిన గుడిని బాగుచేసుకోకుండా ఉంటాడా? అని!'' పెద్దగా ఆరా తీస్తున్నట్లు అన్నది మునెమ్మ.

''అంతమాట అనకు మునెమ్మా! ఈ గుడి బాగుచేస్తే నాలాంటోళ్లకు చోటు దొరుకుద్దా? మొన్నటికి మొన్న పడిన గాలివానకు మేం ఇంకా ఉన్నామంటే ఆ దేవుని దయే కదా? నాలాంటోళ్లకు, ఈ పక్షులకు, ఈ జంతువులకు ఆసరా ఉంటదా? ఆ సామి తలుచుకుంటే ఈ గుడి ఏంది? లోకాన్నే బాగుచేస్తాడు. ఏదో మాబోటోళ్లకు ఆసరా అని ఇట్టా వదిలేసినాడేమో!?'' అన్నాడు



గర్భగుడికేసి చూసి నమస్కారం చేస్తూ..

ఆ మాటలకు ఇంకేం సమాధానం ఇవ్వలేక మునెమ్మ బయటికి కదిలింది..

''పార్వతమ్మ ఏం చేస్తున్నదో!? మళ్లీ కలుస్తాలే!'' అంటూ..

* * *

రాజయ్య, మునెమ్మ పరిచయం విచిత్రంగా కుదిరింది. ఏ ఊరునుంచి వచ్చాడో.. ఒకరోజు తన ఇంటి ముందు కళ్లు తిరిగి పడిపోవడం చూసింది మునెమ్మ. వెంటనే ఆమెతోపాటు మరికొందరు ఆడవాళ్లు అతని ముఖంపై నీళ్లు చల్లి లేపారు. లేచిన తర్వాత అతను అన్న మొదటి మాట.. 'ఆకలి'! అప్పుడే మునెమ్మ పనిచేసే చోట అన్నం, పప్పు తెచ్చుకున్నది. వెంటనే ఆ అన్నాన్ని ఒక ఆకులో పెట్టింది. దాంతో మునెమ్మ అంటే ఎంతో ఆత్మీయత ఏర్పడింది రాజయ్యకు. ఆ తర్వాతే రాజయ్య జీవితం గురించి మునెమ్మకు తెలిసింది.

రాజయ్యకు పెళ్లయి కొడుకు శివయ్య పుట్టగానే భార్య చనిపోవడం.. అప్పటినుంచి రెండో పెళ్లి చేసుకోకుండా పిల్లవాణ్ని రెక్కలు ముక్కలు చేసుకొని చదివించడం, పెద్దయ్యాక అందరు పిల్లల్లానే శివయ్య పనికోసం దూర ప్రాంతానికి వెళ్లిపోవడం, తండ్రిని తీసుకెళ్దామంటే కోడలు వద్దనడం, ఆమె మాటను కొడుకు తు.చ. తప్పకుండా పాటించడం, దాంతో రాజయ్య దిక్కులేనివాడు కావడం.. ఈ విషయాలన్నీ తెలుసుకున్న మునెమ్మకు 'పాపం!' అనిపించింది. అప్పట్నుంచి ఉన్నదాంట్లో ఏం చేసుకున్నా తనకూ పెడుతూ.. రాజయ్యను ఓ ఆత్మీయుడిలా చూసుకుంటున్నది. కష్టమైనా, సుఖమైనా, ఆనందమైనా.. తన జీవితంలో ఏం జరిగినా రాజయ్యకు చెప్పడం అలవాటుగా చేసుకున్నది. కాకుంటే ఈ పదేళ్లలో రాజయ్య తోబుట్టువు కంటే ఎక్కువే అయ్యాడు. లోకం ఎన్ని అన్నా, తాగివచ్చి మొగుడు నానా మాటలు అన్నా.. పెద్దగా పట్టించుకునేది కాదు. ఏ జన్మలో బంధమో అనుకునేది. పేదవాడైనా వేదాంతిలా రాజయ్య చెప్పే విషయాలు మునెమ్మను ఎంతో ఆలోచింపజేసేవి. గుడినే అంటిపెట్టుకుని జీవిస్తున్న రాజయ్య.. ఆమె కంటికి ఒక బాబాలా కనిపించేవాడు.

* * *

''మునెమ్మక్కా.. మునెమ్మక్కా!'' అనే అరుపు వినేసరికి ఒక్క ఉదుటున లేచింది.

ఎదురుగా రామును చూసి..

''ఏమైందిరా!?'' అని అడిగింది.

''నీకు ఈ విషయం తెలుసా అక్కా? మరి ఆ గుడిని పడగొట్టేస్తారంట.. అదేదో ఆఫీసోళ్లు శివాలయాన్ని పడగొట్టి మల్లా కడతారని అంటున్నారు. కొందరేమో.. 'లేదు గుడి కట్టరు! అపార్ట్‌మెంట్ లేపుతారంట!?' అంటున్నారు'' అని చెప్పాడు ఆయాసపడుతూ.

ఆమాట వినగానే తన ఇంటినే ఎవరో కొట్టేస్తున్నట్లుగా గుండెను పిండినట్లయింది మునెమ్మకు..

'అదేంటిది? ఇందాక నేనన్న మాటలు ఆ దేవుని చెవిలో పడినయా ఏంది? మరి ఈ గుడిని పడగొడితే రాజయ్య ఏమైతడు?' అనుకుంటూ ఒక్క పరుగున గుడికి చేరుకుంది మునెమ్మ.

నిద్రపోతున్న రాజయ్యను లేపి..

''ఓ రాజయ్యా! నేను పాపిష్టిదాన్ని! ఇందాక నేను అన్న మాటలు ఆ దేవుడు ఇన్నడో ఏమో కానీ.. రేపు ఉదయమే ఈ గుడిని ఎవరో ఆఫీసోళ్లు పడగొడతారంట. మల్లా కడతారంట!?'' అన్నది ఏడుస్తూనే!

ఆ మాటలకు ఒకింత కంగారుపడ్డ రాజయ్య.. బయటికి పడనీకుండా..

''ఊరుకో మునెమ్మా! ఇప్పుడేమైందని? ఏది జరిగినా ఆ సామి సంకల్పమే కదా? మనమెంత? ఆయనకు తెలవదా? ఈడ ఎంతమంది ఆసరాగా ఉన్నమో అని.. రేపు గుడి కళకళలాడుతూ తయారైందనుకుందాం. నేను ఏడికి పోతా? బయటనే కుర్చుంటా! ఏడికి పోకుండ ఈడ్నే బిచ్చం ఎత్తుకుంటా. ఇక పావురాలు గుడిలోనే ఉంటాయి. జంతువులంటావా? ఆటికీ ఎక్కడో ఒకతాన జాగ ఆ సామి చూపుతాడులే! దానికోసం అంత దిగులు పడమాకు. అంతా ఆ సామి లీల!'' అన్నాడు ఆకాశానికేసి చూసి.. దండం పెడుతూ!

''ఏమో రాజయ్యా! నాకైతే చాన బాధగా ఉంది'' అన్నది కళ్లు తుడుచుకుంటూ..

అందుకూ.. రాజయ్య నుంచి చిరునవ్వే సమాధానంగా వచ్చింది. ఇక ఆపై ఏమీ మాట్లాడలేక, మునెమ్మ అక్కణ్నుంచి వెళ్లిపోతూ.. వెనక్కి తిరిగి చూస్తూ దేవునికి నమస్కరిస్తూ..

'సామీ! అన్నీ తెలిసినోడివి. నువ్వే వీళ్లందర్నీ కాపుగాయాల' అనుకుంటూ వెళ్లిపోయింది.

* * *

తెల్లవార్లూ మునెమ్మకు నిద్రలేదు.

'రాజయ్యంటే మనిషి. ఎక్కడికైనా పోయి తల దాచుకుంటాడు. ఆ పక్షులు, జంతువులు ఏం గావాల? పాపం! నాదగ్గర డబ్బుంటే.. నేనే ఒక గుడి కట్టించి వాటన్నింటినీ అందులోనే ఉంచేదాన్ని గదా?' అనుకుంది.

తెల్లవారి సరిగ్గా పదిగంటలకల్లా బుల్‌డోజర్లతో గుడిని కూలకొట్టేందుకు అధికారులు వచ్చారు. అక్కడున్న ముష్టివాళ్లందర్నీ వెళ్లగొట్టారు. కుక్కల్ని, పిల్లుల్ని తరిమేశారు. గర్భగుడి తలుపు బలవంతంగా తెరిచారు. ఎదురుగా శివలింగం. ఆ అధికారులతో వచ్చిన ఓ బ్రాహ్మణుడు.. ఆ లింగాన్ని శాస్త్రోక్తంగా తీయడానికి ముందుకు కదిలాడు. అయితే, గర్భగుడి గచ్చుకింద పందికొక్కులన్నీ రంధ్రాలు చేశాయేమో.. నేలపై కాలు పెట్టగానే కసక్ కసక్ మంటూ దిగిపోవడం ప్రారంభించింది. దుమ్ము కొట్టుకుపోయిన శివలింగాన్ని ఒక దుప్పటిలో చుట్టాడు బ్రాహ్మణుడు. అక్కడున్న పూజాసామగ్రిని, పారల్ని, కొన్ని అవసరమైన సామగ్రిని తీసుకుని బయటికి తీసుకు వచ్చాడు. ఇక అక్కడేం అవసరమైనవి లేవని గుర్తించాక.. బుల్‌డోజర్లతో గుడిని కూల్చేశారు. కొన్ని గోడల్ని మాత్రం సుత్తితో కొట్టడం మొదలుపెట్టారు. ఆ చప్పుడుకు వందల సంఖ్యలో పావురాలు, పక్షులు అన్నీ ఎగిరి పారిపోతున్నాయి. ఎలుకలు, పందికొక్కులు పరుగు ప్రారంభించాయి. ఇంకా ఎవరూ గమనించని క్రిములు, సాలీళ్లు అన్నీ నామరూపాలు లేకుండా పోయాయి. రాజయ్య, తనతోపాటు ఉన్న మరికొందరు ముష్టివాళ్లంతా ఎదురుగా ఉన్న ఒక బస్‌స్టాప్‌లో కూర్చున్నారు. అందరికీ మనసులో తెలియని బాధే! అందరి మదిలో 'ఇక ఎక్కడుండాలి?' అనే ప్రశ్నే! ఒక్కొక్కరూ ఒక్కో దిక్కుకు వెళ్లడానికి ప్రయత్నించకుండా తిండికి వేట ప్రారంభించారు. అనుకున్న తీరులో రెండు రోజుల్లో గుడినంతా నేలకూల్చారు.

'కట్టడానికైతే కాలం పడుతుంది కానీ.. కూల్చడానికి కాలమెందుకు?' అనుకుని నవ్వుకున్నాడు రాజయ్య!

* * *

దాదాపు ఆరునెలల కాలంలోనే.. ఆ ప్రాంగణంలోనే దివ్యమైన మందిరం కొలువుదీరింది. రాజయ్య అనుచరులు అందరూ బస్‌స్టాప్‌లలోనూ, ఒక్కోచోట ఉండటానికి అలవాటు పడ్డారు. ఎవరికి వారు ఒక్కోదిక్కుకు చేరిపోయారు. కడుపు నింపుకొనేందుకు ఒక్కొక్కరూ ఒక్కో ప్రదేశాన్ని, ప్రాంతాన్ని ఎంచుకున్నారు. రాజయ్య మాత్రం అదే వీధిలో ఉంటూ.. ఆ గుడి ముందే ఉన్న బస్‌స్టాప్‌లోనే ఉండిపోయాడు. పగలంతా అడుక్కున్నా రాత్రయ్యేసరికి అక్కడే నిద్రపోవడం అలవాటుగా మార్చుకున్నాడు.

''గుడి ఇప్పుడు భలేగా ఉందిరా!'' అన్నాడు ఒక ఆసామి మరొక ఆసామితో.

''అవునురా! ఒకప్పుడు ఈ వైపు చూస్తేనే భయం వేసేది. ఆ కట్టినవాళ్లు ఇద్దరూ చనిపోవడంతో.. గుడిని అలానే వదిలేశారు. పోనీలే.. ఇప్పటికైనా ఒక ప్రయత్నం చేశారు!'' అన్నాడు మరో ఆసామి.

అది విన్న రాజయ్యకు కూడా నిజమే అనిపించింది. శివలింగ ప్రతిష్ఠాపన చేశారు. శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అన్నదానం చేశారు. ఆ దానంలో రాజయ్య కూడా తిన్నాడు.. అక్కడే ఒక కొత్త బోరింగు. నిత్యం నీళ్లు వచ్చేలా కుళాయిలు. ఒక్కటేమిటి? ఆ గుడి స్వరూపమే మారిపోయింది. రాజయ్య కడుపునిండా తిని.. ఒక్కసారి వెనక్కి తిరిగి..

'శివయ్యా! ఎంత అదృష్టవంతుడివయ్యా! నీకు కావాల్సినట్టు కట్టించుకున్నావు. అన్ని ఏర్పాట్లు చేసుకున్నావు. ఇంకేం? నీకు పూజలు, అభిషేకాలు ఒక్కటేమిటి? ఇక పండగలే పండగలు.. నేను మాత్రం నీ దగ్గరే ఉంటానయ్యా! నీ గుడి మెట్లమీదే అడుక్కుంటూ ఉంటాను. నిన్ను వదుల్దామనుకున్నావా? అది జరగదు' అని మనసులో అనుకుంటూనే..

''ఏది నిజం? ఏది అబద్ధం? ఏది ఎంతవరకు మన సొంతం? ఏ నిమిషంలో ఏం జరుగుతుందో ఎవరికి ఎరుక'' అని పైకి అన్నాడు నవ్వుతూ..

ఆ మాటలు విన్న ఇద్దరు వ్యక్తులు..